క్లుప్తంగా

కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న రూపేశ్‌రెడ్డి

కైలాస్‌నగర్: బేల మండల కేంద్రంలో ఆర్టీసీ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి కోరారు. బుధవారం కలెక్టరేట్ ఏవో అరవింద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బేలలో ఆర్టీసీ బస్టాండ్ స్థలం 1.15 గుంటల వరకు ఉంటుందని, ప్రహరీ లేకపోవడంతో అక్రమార్కులు సర్వే నం.42లో 20 ఫీట్ల రోడ్డును ప్లాట్లు చేశారని ఆరోపించారు. 100 ఫీట్లు పొడవు, 20 ఫీట్ల వెడల్పుతో రోడ్డును బస్టాండ్ స్థలంలోకి దారి మళ్లించారన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఐఎన్‌టీయూసీ బేల మండల అధ్యక్షుడు ఎండీ అఖిల్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు మాడవి చంద్రకాంత్, విపిన్ ఠాక్రే, అవినాష్ గోడే, రాకేశ్ భాస్కర్, ఠాక్రే శంకర్, నరేందర్, సుమిత్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



సన్మానిస్తున్న మండల ప్రజాప్రతినిధులు

నేరడిగొండ: శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఇచ్చోడ సర్కిల్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం నేరడిగొండ పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. ఎస్సై సాయన్న, మండల ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి, వడూర్ ఎంపీటీసీ అంబేకర్ పండరిలు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, జ్ఞానేశ్వర్, ఏలేటి శేఖర్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

ఇచ్చోడ: ఇచ్చోడ సీఐగా పెద్దపెల్లి చంద్రశేఖర్ బుధవారం సీఐ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన ముడావత్ నైలు నాయక్ భైంసారూరల్ సీఐగా బదిలీపై వెళ్లారు. భైంసారూరల్ సీఐగా పనిచేసిన చంద్రశేఖర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రత పరిరక్షణ కోసం కృషి చేస్తానని తెలిపారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

ఉట్నూర్‌రూరల్: పల్లెపల్లెకు రేఖక్క కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని తాండ్ర పంచాయతీ పరిధిలోని హోల్వాడి గ్రామంలో పర్యటించారు. క్షేత్రస్థాయిలో అధికారులతో పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజలకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తుంటే అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆమె వెంట ఎంపీపీ జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాం, రమేశ్ పాల్గొన్నారు.

'ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

బేల: బేలలో ఇష్టారాజ్యంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఏబీవీపీ హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీష్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పాఠశాలల్లోనే పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎలాంటి ఉపాధ్యాయ శిక్షణ లేని అభ్యర్థులతో విద్యా బోధన చేస్తున్నారని మండిపడ్డారు. అధిక ఫీజులపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల చదువులపై కనిపించడం లేదన్నారు. విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టి, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏబీవీపీ సభ్యులు రాజు, సాయి, రోహిత్, సుదాం, అశోక్, సురజ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

తాంసి: కాంగ్రెస్ హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు వన్నెల అశోక్ అన్నారు. బుధవారం భీంపూర్ మండలంలోని వడూర్‌లో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ.. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు, యూత్ డిక్లరేషన్, ప్రారంభించే పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అన్ను పటేల్, కొడాల సంతోశ్, మల్లేశ్, స్వామి, రాజు కార్యకర్తలు, పాల్గొన్నారు.

మెరుగుపడనున్న వైద్యసేవలు

- ఆసుపత్రుల్లో జన ఆరోగ్య సమితులు
- నిధులను పర్యవేక్షించనున్న సభ్యులు
- వైద్యానికి ఊతమిచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు
- ఉప కేంద్రాలకు పెరిగిన నిధులు

జిల్లాలోని ఆసుపత్రులు..

సీహెచ్‌సీలు	03
పీహెచ్‌సీలు	22(గ్రామీణం), 5 (అర్బన్)
ఉప కేంద్రాలు	129



సొనాలలోని పీహెచ్‌సీ ఆసుపత్రి

బోథ్: ప్రజల ఆరోగ్య సంరక్షణ, ఆసుపత్రుల్లో వైద్య సేవలు మరింత మెరుగుపర్చేందుకు ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వైద్య ఉపకేంద్రాల స్థాయిలో ఉండే గ్రామ పారిశుధ్య కమిటీలు, మండలస్థాయిలోని ఆస్పత్రి అభివృద్ధి కమిటీలను జనఆరోగ్య సమితులుగా మార్చింది. కమ్యూనిటీ హెల్త్ సెంటర్, జిల్లా ఆసుపత్రి పరిధిలోని ఆసుపత్రి అభివృద్ధి కమిటీలను ఆరోగ్య సమితుల ఏర్పాటు చేసింది.

జిల్లాలో 27 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 129 ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. ఇప్పటి వరకు ప్రతీ పీహెచ్‌సీ, ఉప కేంద్రాల పరిధిలో నిధుల వెచ్చింపునకు అభివృద్ధి, పారిశుధ్య కమిటీలు ఉండేవి. ప్రస్తుతం వీటి స్థానంలో జనఆరోగ్య సమితుల పేరుతో కొత్త కమిటీ కొలువుదీరనున్నాయి.

సమితి సభ్యులు వీరే..

సమితి చైర్మన్‌గా సర్పంచి, కోచైర్మన్‌గా పీహెచ్‌సీ వైద్యాధికారి వ్యవహరిస్తారు. మండల స్థాయిలో ఎంపీపీ, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే, జిల్లాస్థాయిలో జెడ్పీ చైర్మన్ చైర్మన్‌లుగా ఉంటారు. సభ్యులుగా వివిధ శాఖల అధికారులు, ఏఎన్‌ఎంలు, సెర్ప్, మండలస్థాయి అధికారులు ఉంటారు. ఉపకేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రి వరకు అన్నిచోట్ల ఈకమిటీలు కొలువుదీరనున్నాయి. ప్రతీ మూడో శనివారం సమావేశం నిర్వహించి ప్రజారోగ్యంపై చర్చించి తీర్మానాలు చేయాల్సి ఉంటుంది.

పెరిగిన కేటాయింపులు..

గతంలో అన్నిస్థాయిల్లోని ఆరోగ్య కేంద్రాలకు ఏటా కేంద్రం నిధులు మంజూరు చేసేది. అత్యవసర మందుల కొనుగోళ్లు, భవనాల్లో మరమ్మతులు, పారిశుధ్యం, తదితర వాటికి ఖర్చుచేసే వారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు గతంలో మాదిరిగానే నిధులు విడుదల కానుండగా, ఉపకేంద్రాలకు మాత్రం కేటాయింపులు పెరిగాయి. ఇప్పటివరకు ఉపకేంద్రానికి రూ.10 వేల చొప్పున జాతీయ ఆరోగ్య మిషన్ కేటాయిస్తూ వచ్చింది. అవి ఏమాత్రం సరిపోయేవి కావు. ఏఎన్‌ఎంలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పుడు రూ.50 వేలకు పెంచడం గమనార్హం. పీహెచ్సీలకు రూ.1.75 లక్షలు, సీహెచ్‌సీలకు రూ.2.25 లక్షలు ఏటానిధులు కేటాయిస్తున్నారు. ఇక జన ఆరోగ్య సమితిలు నిధులను పర్యవేక్షిస్తుంది.

సేవలు మెరుగయ్యే అవకాశం



ఉప కేంద్రాలకు నిధులు పెంచడంతో సేవలు మెరుగుపడే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో జనసమితి కమిటీలను ఏర్పాటు చేస్తున్నాం. ప్రతీ మూడో శనివారం సమావేశం ఏర్పాటు చేసి వైద్యసేవలు, ఆసుపత్రుల అభివృద్ధిపై చర్చిస్తారు.

– నరేందర్, జిల్లా వైద్యాధికారి

పారదర్శకత ఉంటుంది



ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన సమితి కమిటీలను ఏర్పాటు చేయడం వల్ల పారదర్శకత ఏర్పడుతుంది. ఆసుపత్రికి, సబ్‌సెంటర్లకు వచ్చిన నిధుల సక్రమంగా ఖర్చు చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రతీ మూడో శనివారం సమితి సభ్యులు సమావేశమై సమస్యలపై చర్చించే అవకాశం ఉంటుంది.

– తుల శ్రీనివాస్, ఎంపీపీ, బోథ్

అటెన్షన్ ప్లీజ్.. వంతెన లేక అవస్థలు



బజార్‌హత్నూర్: మండలంలోని గిరిజాయి, ఉమార్ద, బద్దునాయికతండా, ఇంద్రనగర్ గ్రామాలు ఏర్పడి 70 ఏళ్లు గడుస్తున్నా.. రోడ్డు, వంతెన సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: సునీల్, డీఈ, ఆర్‌అండ్‌బీ, ఫోన్: 84649 60600

గ్రామాల అభివృద్ధికి కృషి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేరడిగొండ మండలం మాధాపూర్ గ్రామస్తులు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసానికి చేరుకొని వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. పల్లెలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. వీరి వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, బోథ్ ఏఎంసీ చైర్మన్ రుక్మన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

బోథ్: ప్రతిఒక్కరూ ఆధ్మాత్మికతను అలవర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని వితలేశ్వర ఆలయంలో ఆధ్యాత్మిక దినోత్సవంలో పాల్గొని, పూజలు చేశారు. అనంతరం తొమ్మిది ఆలయాలకు దూపదీప నైవేద్యంలో భాగంగా మంజూరైన ప్రొసీడింగ్‌ను అందజేశారు. సొనాల గ్రామానికి చెందిన రాడపాక శంకర్‌కు రూ. 14 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రుక్మణ్‌సింగ్, వైస్ ఎంపీపీ లింబాజీ, వైస్ చైర్మన్ సంజీవ్ రెడ్డి, ఎలుక రాజు, బోథ్ సర్పంచ్ సురేందర్, సొనాల సర్పంచ్ సదానందం పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ కెరటం జయశంకర్

- ఎమ్మెల్యే జోగు రామన్న



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఉద్యమ కెరటమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా బుధవారం తెలంగాణ తల్లి చౌక్‌లో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయశంకర్ సార్ చేసిన పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

ఉట్నూర్‌రూరల్: ఆచార్య కొత్తపెల్లి జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని జిల్లా జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మండలంలోని గంగన్నపేటలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన జీవితాన్ని తెలంగాణకు అంకితం చేశారని వారి జ్ఞాపకార్థం చౌక్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నేతకాని సంగం జిల్లా అధ్యక్షుడు మహేందర్, తిరుపతి, సలీమొద్దిన్, రమేశ్, కరీం, అబుజర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బోథ్: ఆచార్య జయశంకర్ వర్ధంతి సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో తొలితరానికి ఊపిరి పోశారని, మలితరానికి మార్గదర్శి అయ్యారని పేర్కొన్నారు. కాగా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రుక్మణ్‌సింగ్, వైస్ ఎంపీపీ లింబాజీ, వైస్ చైర్మన్ సంజీవ్ రెడ్డి, ఎలుక రాజు, సర్పంచ్ సురేందర్, సుభాష్, జగన్ రెడ్డి, రమణగౌడ్, రాయల్, సోమన్న, పోశెట్టి, చాబంతుల శ్రీకర్, రంగు రాజు, సౌరాల రూపేష్ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

బోథ్: మండలంలోని నిగిని గ్రామంలో బుధవారం బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధికార ప్రతినిధి సాకటి దశరథ్ పర్యటించారు. గురువారం నుంచి చేపడుతున్న గడప గడపకూ బీజేపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ మెటీరియల్ అందజేశారు. ఈనెల 30 వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుభాష్ సూర్య, ప్రధాన కార్యదర్శి తుకారాం, నాయకులు, తదితరులపాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం



వాంకిడిలో కురుస్తున్న వర్షం

నేరడిగొండ: మండలంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఇన్నిరోజుల పాటు ఎండలతో స తమతమైన జనాలు బుధవారం కురిసిన కొద్దిపాటి వర్షానికి ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. మృగశిరకార్తె ప్రవేశించినప్పటి నుంచి మొదటిసారిగా మండలంలో చిరు జల్లులు కురిశాయి. మరిన్ని భారీ వర్షాలు కురిస్తే రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం కానున్నారు.

ఊరూరా యోగా దినోత్సవం



తాంసి: యోగాసనాలు వేస్తున్న ఉపాధ్యాయులు



సిరికొండ: యోగా చేస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్: జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. యోగాసనాలు వేసి యోగా ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. పట్టణంలోని సంరక్షణ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే జొగురామన్న యోగాసనాలు వేశారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదిలాబాద్ క్రీడా పాఠశాల విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఐపీ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకుంటున్న చిన్నారులు యోగా దినోత్సవంలో పాల్గొన్నారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని గ్రామాల్లో బుధవారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యాలయాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆరోగ్య కేంద్రాల్లో గ్రామస్తులతో కలిసి యోగాసనాలు వేశారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ యోగాసనాలు వేశారు. వేదం పాఠశాలలో, సొనాలలోని వివేకానంద పాఠశాలలో యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో యోగా గురువు కుమ్మరి పోశెట్టి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్ రావ్ దేశ్‌పాండే, న్యాయవాదులు ఆడెపు హరీశ్, కుమ్మరి విజయ్, వివేకానంద పాఠశాలలో ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య, వేదం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: సిరికొండ, వాయిపేట్, సుంకిడి, రాంపూర్, సోన్‌పెల్లి, రాయిగూడ, రిమ్మ ఆశ్రమ పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసానాలు వేశారు. యోగా ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ప్రతిరోజు యోగా చేయడం ద్వారా అనారోగ్య సమస్యలు దూరమవుతాయని యోగా గురు పద్వాల్ విజయ్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద యోగాసనాలు వేశారు. పాఠశాలల్లో తప్పనిసరిగా యోగా శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే తిప్పలు తప్పవు'



కుట్టుమిషన్ కుడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

జైనథ్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నకు ఓటేస్తే ఐదేళ్లు తిప్పలు తప్పవని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గడప గడపకూ కాంగ్రెస్.. పల్లె పల్లెకు కంది శ్రీనన్న నినాదంతో జైనథ్ మండలంలో బుధవారం పర్యటించారు. అంతకుముందు మండల కేంద్రంలోని లక్ష్మినారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం మండలంలోని లక్ష్మీపూర్, పిప్పల్ గావ్, పార్డీ (బి), పార్డీ (కె) గ్రామాల్లో కాంగ్రెస్ డిక్లరేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ 40 వేల మెజార్టీతో గెలుస్తుందన్నారు. జోగు రామన్న ఆదిలాబాద్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని ఆరోపించారు. కార్యక్రమంలో జైనథ్ ఎంపీటీసీ సుదర్శన్, లక్ష్మీపూర్ ఎంపీటీసీ జైమాల మనోజ్, అల్లూరి అశోక్ రెడ్డి, రాజన్న, స్వామి యాదవ్, నాగర్‌కర్ శంకర్, గిమ్మ సంతోశ్‌రావు, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం



జైనథ్: పూజలు చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



ఆదిలాబాద్‌రూరల్: బుద్ధ వందనం చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

జైనథ్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డిలు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి పెద్ద పీట వేస్తోందన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పూంద్రు వెంకట్ రెడ్డి, సర్పంచ్ దుమాల దేవన్న, తహసీల్దార్ రాఘవేంద్ర రావు, ఎంపీడీవో గజానన్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గల బుద్ధవిహార్‌లో ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పంచశీల జెండా ఆవిష్కరించి, దళిత నేతలతో కలిసి బుద్ధ వందనం చేశారు. గౌతమ బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి వెలిగించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, దళిత సంఘాల నేతలు దుర్గం శేఖర్, శాలిక్‌రావ్ నాగారడే, బాబా సాహెచ్ కాంబ్లే, దయానంద్ కాంబ్లే, శైలేందర్ వాఘ్మరే, రాంకుమార్, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని సోనాల గ్రామంలో బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయంలో ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఒక్కరూ భక్తి భావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సదానందంచ ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీవో జీవన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సంస్కృతి, సాంప్రదాయాలకు గుర్తింపు వచ్చిందని ఎంపీపీ పోటే శోభాబాయి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక ఉత్సవాలు నిర్వహించారు. మండల కేంద్రంలో సర్పంచ్ కోరెంగా గాంధారి ఆధ్వర్యంలో ఇంద్రాదేవి ఆలయంలో పూజలు చేశారు. హర్కపూర్ అంద్‌గూడలో సర్పంచ్ కుడే కైలాస్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు శారద, ఎంపీడీవో పుష్పలత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు తెలంగాణ అమరుల సంస్మరణ సభ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు తెలంగాణ అమరుల సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. గ్రామస్తులు హాజరు కావాలని కోరారు.

రక్తదానం

ఉట్నూర్‌రూరల్: జైనూర్ మండలం జంగాం గ్రామానికి చెందిన మైనుబాయి కూతురు గర్భిణికి వైద్యాధికారులు రక్తం అవసరం చెప్పడంతో ఫ్రెండ్స్ యూత్ నాయకులు ఓసామా, అంజత్ ఖాన్, మజర్ ఖాన్‌లు బుధవారం సాయంత్రం ఆసుపత్రికి చేరుకొని రక్తదానం చేశారు.

హనుమాన్ ఆలయానికి విరాళం

బోథ్: మండలంలోని నాగాపూర్ గ్రామస్తులు బుధవారం నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ. 11 వేల విరాళాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట కోవ మాన్కు, పవార్ బలిరాం, అర్క కోసేరావ్, రాథోడ్ యమునాయక్, గొడం రాజు, మడావి నాగోరావ్, తుకారం, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

బోథ్: బోథ్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని సర్పంచ్ సురేందర్ యాదవ్ అన్నారు. బుధవారం పంజేషా కాలనీలో పర్యటించారు. సమస్యలను కాలనీవాసులు వివరించి, వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట రఫీ, అబ్దుల్ అఖిల్, ఇర్ఫాన్, గౌస్, అక్బర్, షాకీర్ ఉన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

బోథ్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బోథ్‌లోని సాయినగర్ కాలనీవాసులు, కొత్తపల్లె, నేరేడుపల్లె, కరత్వాడ గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యే బాపురావును ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని గ్రామస్తులు తెలిపారు.

సూట్‌కేస్ అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది

ఉట్నూర్‌రూరల్: ఈనెల 21న ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు సూట్‌కేట్ మరిచిపోయాడు. అట్టి సూట్‌కేస్ బస్ కండక్టర్ వందన డిపోలో అప్పగించారు. సదరు వ్యక్తిని అధికారులు గుర్తించి బుధవారం సూట్‌కేసు అప్పగించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జి జనార్దన్, బీఆర్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: ఎంబీబీఎస్, ఐఐటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కత్తి సాత్విక, సేర్ల నిహాల్ చైతన్య, సేర్ల నవనీత్, రొడ్డ జాహ్నవిలతో పాటు వారి తల్లిదండ్రులను మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు చందల రాజన్న, అలాలి అజయ్, గాలిపల్లి నాగన్న, ఈర్ల దయాకర్, ఇజ్జగిరి సంజీవ్, ఏవన్, రొడ్డ సాగర్, సేర్ల చిన్నయ్య పాల్గొన్నారు.

రుషికేశ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



రిషికేశ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్చోడ: ప్రతీ విద్యార్థి రుషికేశ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ ఉదయ్‌రావు తెలిపారు. జిల్లా పరిషత్ పాఠశాలలో పదో చదువుతున్న డోల్లే రుషికేశ్ అంతర్జాతీయ సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక కావడంతో బుధవారం రుషికేశ్, ఆయన తండ్రి పరమేశ్వర్‌ను సన్మానించారు. నవంబర్‌లో జపాన్‌లో జరగనున్న అంతర్జాతీయ సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపాడు. సన్మానించిన వారిలో విద్యకమిటీ చైర్మన్ సురేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.